

ఆక్రమణలపై కొరడా

నిబంధనలకు విరుద్ధంగా చెరువును ఆక్రమించి యథేచ్ఛగా చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని అధికారులు కూల్చి వేశారు. 8లో▸



సంప్రదాయాలను..

సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి రమేశ్ పేర్కొన్నారు. 8లో▸



అడిషనల్ కలెక్టర్‌కు వినతి

అడిషనల్ కలెక్టర్ ప్రతిమాసింగ్‌ను బడంగ్‌పేట మేయర్ చిగురింత పారిజాత కలిసి వినతిపత్రం అందజేశారు. 8లో▸

న్యూస్‌రీల్

కేంద్రమంత్రి మురుగన్‌కు సత్కారం



కేంద్రమంత్రి మురుగన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీజేపీ నాయకుడు భరత్

ఆమనగల్లు: కేంద్రంలోని నూతన ఎన్‌డీఏ ప్రభుత్వంలో కేంద్రమంత్రిగా ప్రమాణ స్వీకారం చేసిన తమిళనాడు రాష్ట్రానికి చెందిన మురుగన్‌ను సోమవారం నాగర్‌కర్నూల్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి, జెడ్పీటీసీ భరత్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఢిల్లీలో మంత్రి మురుగన్‌ను కలిసిన భరత్ పుష్పగుచ్ఛం అందించి శాలువాతో సత్కరించారు.

ఐటీఐలో అడ్మిషన్లకు గడువు పొడిగింపు

షాద్‌నగర్‌రూరల్: కమిషనర్ ఆఫ్ ఎంప్లాయిమెంట్ అండ్ ట్రెయినింగ్ డిపార్ట్‌మెంట్ హైదరాబాద్‌వారి ఆదేశాల మేరకు ఐటీఐ కళాశాలలో చేరేందుకు అడ్మిషన్ల గడువు పెంచడ జరిగిందని కళాశాల ప్రిన్సిపాల్ తిరుపతిరెడ్డి సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అడ్మిషన్‌కోసం దరఖాస్తు చేసుకునేందుకు ఈ నెల 14 వరకు గడువు పొడిగించినట్లు తెలిపారు. ఐటీఐలో ప్రవేశం తీసుకోవాలనుకునే విద్యార్థులు ఐటీఐ.తెలంగాణ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఆసక్తి కలిగిన విద్యార్థులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

'ఆటా' వేడుకల్లో చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య



మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావుతో కలిసి పాల్గొన్న ఎమ్మెల్యే

చేవెళ్ల: అమెరికాలోని అట్లాంటా జార్జ్ వరల్డ్ కాంగ్రెస్ సెంటర్ కమిటీ హాల్‌లో జరిగిన అమెరికా తెలుగు అసోసియేషన్ 18వ వార్షికోత్సవానికి చేవెళ్ల ఎమ్మెల్యే కాలె యాదయ్య హాజరయ్యారు. సోమవారం అక్కడ జరిగిన వేడుకల్లో రాష్ట్ర ఐటీ మంత్రి శ్రీధర్‌బాబు, మాజీ ఎమ్మెల్సీ రాంచందర్‌రావుతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అక్కడి తెలుగు అసోసియేషన్ సభ్యులు వారిని ఘనంగా సన్మానించారు.

టీచర్ పోస్టులకు దరఖాస్తుల ఆహ్వానం

చేవెళ్ల: తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కళాశాలలో ఐదు పీజీటీ అవర్లీ బేస్డ్ టీచర్ల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ టీనావతి తెలిపారు. సోమవారం ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. చేవెళ్ల మండలకేంద్రంలోని తెలంగాణ మోడల్ స్కూల్, కళాశాలలో ఐదు టీచర్ పోస్టులకు (అవర్లీబేస్డ్ బోధన) ప్రభుత్వం అనుమతించిందని చెప్పారు. ఐదు పీజీటీ టీచర్ల పోస్టులు ఉన్నట్లు తెలిపారు. ఇందులో రెండు తెలుగు, ఒకటి హిందీ, ఫిజిక్స్, జువాలజీ పోస్టులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు చెప్పారు. అభ్యర్థులు డిగ్రీ, పీజీ, బీఈడీ ఉత్తీర్ణులై ఉండాలన్నారు. ప్రభుత్వం నిర్దేశించిన అర్హతలు, అనుభవం అంశాలను ప్రాతిపదికగా తీసుకొని మెరిట్ అభ్యర్థులను ఎంపిక చేస్తారని తెలిపారు. అర్హులైన అభ్యర్థులు రెండురోజుల్లో తమ సర్టిఫికెట్లు తీసుకొని ఇంటర్వ్యూకు హాజరుకావాలని కోరారు. ఇతర వివరాలకు మోడల్ స్కూల్‌లో సంప్రదించాలని సూచించారు.

సహకార శాఖ అభివృద్ధికి కృషి



కొత్తకుర్మ సత్తయ్యకు శుభాకాంక్షలు

తుర్కయంజాల్: రాష్ట్ర సహకార బ్యాంక్ వైస్ చైర్మన్‌గా డీసీసీబీ చైర్మన్, తుర్కయంజాల్ రైతు సేవా సహకార సంఘం చైర్మన్ కొత్తకుర్మ సత్తయ్య ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి, తాండూరు ఎమ్మెల్యే బి.మనోహర్ రెడ్డి, టెస్కాబ్ చైర్మన్ రవీందర్ రావుకు కృతజ్ఞతలు తెలిపారు. సహకార శాఖ అభివృద్ధి కోసం పనిచేస్తానని పేర్కొన్నారు.



యాచారం: సర్కారు పాఠశాలలో చేరాలంటూ 'బడిబాట'

కందుకూరు: ఎంఈఓ కార్యాలయంలో పాఠ్య పుస్తకాల పంపిణీ





షాద్‌నగర్‌రూరల్: యూనిఫాం అందజేస్తున్న షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

బడి గంటలు మోగే వేళ



రేపటి నుంచి కొత్త విద్యా సంవత్సరం ప్రారంభం



బహదూర్‌గూడలోని ప్రభుత్వ పాఠశాలలో..

ముస్తాబవుతున్న పాఠశాలలు, తరగతి గదులు

- సర్కారు బడుల్లో అలంకరణకు ఆదేశాలు
- అటు వెక్కిరిస్తున్న టీచర్ల ఖాళీలు.. ఇటు కనీస సౌకర్యాలు కరువు
- ఇప్పటికీ పూర్తికాని అమ్మ ఆదర్శ పనులు
- ప్రైవేట్‌లో ఫీజుల మోత
- నిద్రావస్థలో విద్యాశాఖాధికారులు

సాక్షి, సిటీబ్యూరో: వేసవి సెలవులు పూర్తయ్యాయి.. మళ్లీ బడికి వేళవుతోంది.. ఓవైపు ప్రైవేటు పాఠశాలలు సకల సౌకర్యాలతో విద్యార్థుల తల్లిదండ్రులను రారమ్మని.. రారా రమ్మని.. స్వాగతం పలుకుతున్నాయి. మరోవైపు పలు సర్కారు బడులు ఇంకా సౌకర్యాల లేమితోనే విద్యార్థులను ఆహ్వానిస్తున్నాయి. ప్రభుత్వ ఆదేశాలతో బుధవారం నుంచి 2024–2025 విద్యా సంవత్సరం బడిగంటలు మోగనున్నాయి. విద్యార్థుల ఉరుకులు పరుగులు.. కేరింతలు.. మొదలవనున్నాయి.. ఇప్పటికే ప్రైవేటు, కార్పొరేట్ కళాశాలలు అడ్మిషన్ల ప్రక్రియను పూర్తి చేయగా.. సర్కారు బడులు మాత్రం అలంకరణలకు ఆదేశాల క్రమంలోనే ఉన్నాయి. మరోవైపు కార్పొరేట్ పాఠశాలలు లక్షల ఫీజులు వసూలు చేస్తున్నా.. దీనిపై విద్యాశాఖ మాత్రం కిమ్మనకుండా ఉందని తల్లిదండ్రులు వాపోతూ.. తమ ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు.

రేపటి నుంచి సందడి షురూ

బుధవారం నుంచి నూతన విద్యా సంవత్సరం (2024–2025) ఆరంభం కానుంది. ప్రతి ఉదయం విద్యార్థులు ఓ పక్క, వారి తల్లిదండ్రులు మరో పక్క ఉరుకులు పెట్టనున్నారు. అటెన్షన్‌ప్లీజ్.. సైలెన్స్ ప్లీజ్ అంటూ టీచర్ల పని ప్రారంభం కానుంది. ఇక విద్యార్థులకు స్వాగతం పలికేందుకు ఇటు సర్కారు.. అటు కార్పొరేట్ పాఠశాలలు ముస్తాబవుతున్నాయి. ఈ మేరకు ఇప్పటికే సర్కారు బడుల్లో తరగతి గదులను అందంగా అలంకరించాలని విద్యాశాఖ ఆదేశాలు జారీచేయగా.. కార్పొరేట్ విద్యాసంస్థలు అలంకరణలు, అడ్మిషన్లు వంటి ప్రక్రియను ఇప్పటికే పూర్తిచేశాయి. బడ్జెట్ పాఠశాలలు కొత్త విద్యార్థులను ఆకర్షించేందుకు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నాయి. పదో తరగతిలో సాధించిన ఫలితాలతో ఆకర్షణీయ ప్రకటనలు, పాంప్లెట్లతో ప్రచారం ప్రారంభించాయి.



గోషామహల్ పాఠశాలలో మరమ్మతులు

22.40 లక్షల మంది విద్యార్థులు

గ్రేటర్ పరిధిలో ప్రభుత్వ, ప్రైవేటు, ఎయిడెడ్ విద్యాసంస్థలు కలిసి సుమారు 7,587 ఉండగా, అందులో దాదాపు 22.40 లక్షలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. హైదరాబాద్ జిల్లాలో 2,902 స్కూళ్లలో 9.72 లక్షల మంది విద్యార్థులు, రంగారెడ్డి జిల్లాలో 2761 స్కూల్స్‌లో 6.70 లక్షల మంది విద్యార్థులు, మేడ్చల్ జిల్లాలో 1,924 స్కూళ్లలో 6.06 లక్షల మంది విద్యార్థులున్నారు. మొత్తం మీద ప్రైవేటు పాఠశాలల సంఖ్య అధికంగా ఉంది. సుమారు ఆరు వేలకుపైగా ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయన్నది అధికారుల అంచనా. అందులో దాదాపు 17 లక్షలకు పైగా విద్యార్థులు చదువుతున్నట్లు విద్యాశాఖ గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

ఖాళీలే.. ఖాళీలు

సర్కారు బడుల్లో ఉపాధ్యాయుల ఖాళీలు వెక్కిరిస్తున్నాయి. దీర్ఘకాలంగా ఉద్యోగ విరమణతో ఖాళీ అయిన పోస్టులు భర్తీ కావడం లేదు. ఉన్నత పాఠశాలల్లో సబ్జెక్టు నిపుణుల పోస్టుల భర్తీ అంతంత మాత్రంగా ఉందని, దీంతో విద్యార్థుల చదువులు భారంగా మారుతున్నాయనేది తల్లిదండ్రుల వాదన. దీనిని గత విద్యా సంవత్సర పదో తరగతి ఉత్తీర్ణతా శాతం మరింత బలపరుస్తోంది. ఇక ప్రైవేటు విద్యా సంస్థల్లో తక్కువ వేతనాలకు పనిచేసే టీచర్ల నైపుణ్యం అంతంత మాత్రంగా తయారైంది. ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీలు, ప్రైవేటులో టీచర్ల నైపుణ్యత లేమి.. మొత్తంగా ఈ ఏడాదీ విద్యార్థుల భవిష్యత్తుపై తీవ్రంగా ప్రభావం చూపనున్నాయి.

నత్తనడకన అమ్మ ఆదర్శ పనులు

ప్రభుత్వ పాఠశాలల్లో చేపట్టిన అమ్మ ఆదర్శ పనులు అంతంత మాత్రంగా నత్త నడకన సాగుతున్నాయి. కనీస మౌలిక సదుపాయాల కల్పనకు చేపట్టిన పనులు సగం కూడా పూర్తి కాలేదు. సాక్షాత్తు విద్యా శాఖ అధికారుల పర్యవేక్షణ లేమితో పనులు ముందుకు సాగడం లేదు. హైదరాబాద్‌తో పాటు రంగారెడ్డి, మేడ్చల్ జిల్లాల్లోనూ ఇదే పరిస్థితి.

తప్పని ఆర్థిక ఒత్తిళ్లు

ప్రతి విద్యా సంవత్సరం ప్రారంభంలో విద్యార్థుల తల్లిదండ్రులకు ఆర్థిక ఒత్తిళ్లు తప్పడం లేదు. డొనేషన్లు, స్కూల్ ఫీజులు, పుస్తకాలు, స్టేషనరీ తదితర ఖర్చులతో పేద, మధ్య తరగతి కుటుంబాలకు భారంగా మారుతున్నాయి. కొద్దోగొప్పో సంపాదనాపరుల పరిస్థితి ఇలా ఉంటే.. చాలీచాలని వేతనాలతో కాలం గడిపే అసంఘటిత కార్మికులు, చిరుద్యోగుల పరిస్థితి మరింత దయనీయంగా తయారైంది. ఇద్దరు పిల్లలున్న తల్లిదండ్రులు చదువు కోసం సాధారణ బడ్జెట్ స్కూల్లోనే రూ.లక్షకుపైగా ఖర్చు చేయాల్సి వస్తుందనేది ఫీజుల పట్టికను చూస్తే అర్థమవుతుంది.

నిబంధనలకు విరుద్ధంగా..

కొన్ని ప్రైవేటు స్కూల్స్ నిబంధనలకు విరుద్ధంగా స్టేషనరీ వ్యాపారాలు కొనసాగిస్తున్నాయి. హైదరాబాద్ డీఈఓ ప్రత్యేకంగా సర్క్యులర్ జారీ చేసినా..ఫలితం లేకుండా పోయింది. స్కూల్స్ ప్రాంగణాల్లో పాఠ్యపుస్తకాలు, నోటు పుస్తకాలు, యూనిఫాం, బెల్ట్, టై, డైరీ, షూస్ ఇలా విద్యార్థులకు కావాల్సిన సకల సరంజామా బాహాటంగా విక్రయిస్తున్నాయి. కొన్ని స్కూల్స్ అయితే విద్యా సంస్థ పేరుతో ఎంఆర్‌పీ ధరలను ముద్రించుకుని విద్యార్థులకు అంటగడుతున్నాయి. ఇతర షాపుల్లో కొనుగోలు చేసిన నోట్ పుస్తకాలను అనుమతించబోమని స్పష్టం చేయడంతో విధిలేని పరిస్థితుల్లో అక్కడే కొనుగోలు చేస్తున్నారు.

నామినేటెడ్‌పై నజర్



- పార్టీ పెద్దలను ప్రసన్నం చేసుకునేయత్నం
- అధిష్టానం పరిశీలనలో మరికొంత మంది పేర్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రభుత్వ నామినేటెడ్ పోస్టులపై పలువురు నేతలు దృష్టి సారించారు. ఎన్నికల కోడ్ ముగియడంతో ఏళ్ల తరబడి పార్టీ బలోపేతం కోసం కష్టపడుతూ, టికెట్లను సైతం త్యాగం చేసిన కీలక నేతలు ప్రభుత్వంలోని వివిధ నామినేటెడ్ పోస్టులపై ఆశలు పెట్టుకున్నారు. వీటిని దక్కించుకునేందుకు తమదైన శైలిలో పెద్దలతో పైరవీలు మొదలుపెట్టారు.ఇప్పటికే జిల్లాకు మూడు రాష్ట్రస్థాయి కార్పొరేషన్ పదవులు దక్కాయి. తాజాగా మరికొన్ని కార్పొరేషన్లు, కమిషన్లకు చైర్మన్లను నియమించే అవకాశం ఉండటంతో సామాజిక సమీకరణాలు,స్థానిక అంశాలను దృష్టిలో పెట్టుకుని ఈ పదవులను కట్టబెట్టే అవకాశం ఉండటంతో ఎవరికి వారు వ్యక్తిగత పైరవీలు మొదలు పెట్టినట్లు సమాచారం.

ఆశావహుల్లో రేకెత్తిస్తున్న ఆశలు

రాష్ట్రంలో పలు కీలక కమిషన్లు, కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించేందుకు ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఇప్పటి వరకు 37 కార్పొరేషన్లకు చైర్మన్లను నియమించింది. ఇప్పటికే జిల్లాకు మూడు పదవులు కేటాయించింది. వీటిలో రోడ్డు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పోస్టును మల్‌రెడ్డి రాంరెడ్డికి కేటాయించగా, పట్టణ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్మన్ పదవిని, పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి, గత అసెంబ్లీ ఎన్నికల్లో రాజేంద్రనగర్ ఎమ్మెల్యే సీటును త్యాగం చేసిన జ్ఞానేశ్వర్ ముదిరాజ్‌కు డెయిరీ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ పదవిని కట్టబెట్టింది. లోక్‌సభ ఎన్నికల కోడ్ ముగియడంతో తాజాగా మరో 15 నుంచి 20 కార్పొరేషన్లు, కమిషన్లకు చైర్మన్లు నియమించాలని భావిస్తోంది. ఏళ్ల తరబడి పార్టీనే నమ్ముకుని పని చేస్తున్న వారితో పాటు గత అసెంబ్లీ ఎన్నికల్లో సీట్లను త్యాగం చేసిన వారికి ఇప్పటికే చైర్మన్ పోస్టులను కట్టబెట్టాలని యోచిస్తోంది. దీంతో సీఎం రేవంత్‌కు, అధిష్టానం పెద్దలకు సన్నిహితంగా ఉన్నవారితో పాటు సీట్లను త్యాగం చేసిన వారిలోనూ ఈ పదవులు ఆశలు రేకెత్తిస్తున్నాయి.

అవమానిస్తున్నాడని అంతమొందించాడు

- తోటి కార్మికుడిని కర్రతో బాది హత్య
- మహేశ్వరం మండలం తుమ్మలూరులో ఘటన



తులరామ్ మృతదేహం

మహేశ్వరం: సరిగ్గా పని చేయడంలేదని తోటి కార్మికుడు అన్నందుకు అవమానం భరించలేక నిద్రిస్తున్న సమయంలో కర్రతో తలపై బాది హత్య చేసిన సంఘటన మండల పరిధిలోని తుమ్మలూరులో చోటు చేసుకుంది. సీఐ వెంకటేశ్వర్లు తెలిపిన వివరాల ప్రకారం.. మండల పరిధిలోని తుక్కు గూడ గ్రామానికి చెందిన మంగ్యా నాయక్ తుమ్మలూరు గ్రామ శివారులో ఇటుక బట్టీ వ్యాపారం కొనసాగిస్తున్నాడు. బట్టీలో ఒడిశా, చత్తీస్‌ఘడ్ రాష్ట్రాలకు చెందిన పలువురు కార్మికులు పని చేస్తున్నారు. ఒడిశా రాష్ట్రం నుపాడ జిల్లా కొమ్నా మండలం మాన్‌పాడ్ గ్రామానికి చెందిన తులరామ్ సోబోర్(42) ఐదు నెలలుగా మేస్త్రీగా పని చేస్తున్నాడు. చత్తీస్‌ఘడ్ రాష్ట్రం మణిపూర్ గ్రామానికి చెందిన కేత్రో యాదవ్ బట్టీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఇటుకలు తయారు చేసే క్రమంలో సరిగ్గా పని చేయడం లేదని తులరామ్ తరచూ కేత్రోయాదవ్‌ను మందలిస్తూ వచ్చాడు. దీంతో అతనిపై కక్ష పెంచుకున్న కేత్రోయాదవ్ అంతమొందించాలని నిర్ణయించుకున్నాడు. ఈ క్రమంలో ఆదివారం అర్ధరాత్రి తులరామ్ నిద్రిస్తుండగా షెడ్‌లోకి చొరబడి కర్రతో తలపై బలంగా కొట్టాడు. అలికిడికి చుట్టు పక్కల కార్మికులు లేవడంతో అక్కడి నుంచి ఉడాయించాడు. తోటి కార్మికులు తులరామ్‌ను చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు తులరామ్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. మృతుని బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.



ఆర్టీఏ అధికారులతో కలిసి తనిఖీలు నిర్వహిస్తున్న డీటీసీ చంద్రశేఖర్‌గౌడ్

బడిబస్సులకు ఆర్టీఏ బ్రేక్

- ఫిట్‌నెస్ లేని బస్సులపై స్పెషల్ డ్రైవ్
- రోడ్డెక్కితే కఠినచర్యలు: డీటీసీ చంద్రశేఖర్ గౌడ్

సాక్షి, సిటీబ్యూరో: ఫిట్‌నెస్ లేని బడిబస్సులకు రవాణా శాఖ బ్రేకులు వేస్తోంది. అలాంటివి రోడ్డెక్కకుండా కొరడా ఝుళిపిస్తోంది. ఈనెల 12 నుంచి పాఠశాలలు తిరిగి తెరచుకోనున్న నేపథ్యంలో ఉమ్మడి రంగారెడ్డి జిల్లా డిప్యూటీ ట్రాన్స్‌పోర్ట్ కమిషనర్ (డీటీసీ) మామిండ్ల చంద్రశేఖర్‌గౌడ్ నేతృత్వంలో స్పెషల్‌డ్రైవ్ చేపట్టారు. ప్రాంతీయ రవాణా అధికారులు, మోటారు వెహికిల్ ఇన్‌స్పెక్టర్ (ఎంవీఐ)ల ఆధ్వర్యంలో విస్తృతంగా తనిఖీలు చేపట్టారు. ఫిట్‌నెస్ లేని బస్సుల్లో పిల్లలను తీసుకెళ్లడానికి వీల్లేదని, ప్రమాదాలకు కారణమయ్యే అలాంటి వాటిని నడిపితే ఆయా పాఠశాలల యాజమాన్యాలపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి బస్సుకు తప్పనిసరిగా ఫిట్‌నెస్‌ను ధ్రువీకరించుకోవాలని సూచించారు. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో 11,922 బడి బస్సులు ఉండగా, ఇప్పటివరకు 8,917 బస్సులు మాత్రమే ఫిట్‌నెస్ ధ్రువీకరణ పొందాయి. మరో 3,005 బస్సులకు సామర్థ్య నిర్ధారణ కాలేదని ఆయన తెలిపారు. 15 ఏళ్ల సర్వీస్ దాటిన బస్సులు ఎట్టి పరిస్థితుల్లోనూ రోడ్లపై తిరగడానికి వీల్లేదని స్పష్టం చేశారు. ఇలాంటి బస్సుల్లో పిల్లలను తీసుకెళితే వెంటనే సీజ్ చేసి, యాజమాన్యాలపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. బడిబస్సుల నిర్వహణపై త్వరలో సమావేశం ఏర్పాటు చేస్తామన్నారు. ఇప్పటివరకు రంగారెడ్డిలో 5,725 బస్సులకుగాను 4,363, మేడ్చల్–మల్కాజిగిరిలో 5,985 బస్సులకు 4,468, వికారాబాద్‌లో 212 బస్సులకు 86 ఫిట్‌నెస్ కలిగి ఉన్నాయని చెప్పారు. మిగతా బస్సులకు వెంటనే ధ్రువీకరణను పూర్తి చేసుకోవాలని పేర్కొన్నారు.

అర్జీలు పెండింగ్‌లో పెట్టొద్దు

- ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి
- జిల్లా అధికారులకు కలెక్టర్ శశాంక ఆదేశం



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్ల శశాంక, ఇతర అధికారులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: ప్రజావాణి కార్యక్రమానికి ప్రాధాన్యతనిస్తూ అర్జీలను సత్వరమే పరిష్కరించాలని కలెక్టర్ శశాంక అధికారులకు సూచించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమానికి 79 ఫిర్యాదులు అందాయి. లోక్‌సభ ఎన్నికల సందర్భంగా కోడ్ అమలులో ఉండడంతో తాత్కాలికంగా వాయిదా వేసిన కార్యక్రమం ఈ వారం నుంచి తిరిగి ప్రారంభమైంది. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను కలెక్టర్ శశాంకతోపాటు అదనపు కలెక్టర్ భూపాల్‌రెడ్డి, డీఆర్‌ఓ సంగీతకు విన్నవిస్తూ అర్జీలు సమర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. అర్జీలను పెండింగ్‌లో పెట్టకుండా ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో అప్‌లోడ్‌చేసి పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజా సమస్యల సత్వర పరిష్కారం కోసం రాష్ట్ర స్థాయిలో నిర్వహిస్తున్న ప్రజావాణి కార్యక్రమం సందర్భంగా జిల్లాకు సంబంధించి ప్రజలు అందించే వినతులను సంబంధిత శాఖల జిల్లా అధికారులు పంపించడం జరుగుతోందని తెలిపారు. అధికారులు తక్షణమే స్పందిస్తూ వాటిని పరిష్కరించాలన్నారు. వినతులపై చేపట్టిన చర్యలను వివరిస్తూ ఆన్‌లైన్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఒకవేళ వినతులు పరిష్కారం కానట్లయితే, అందుకు గల కారణాలను స్పష్టంగా పేర్కొవాలన్నారు. ప్రజావాణి రిజిస్టర్ నిర్వహించాలని, రిజిస్టర్‌లో నమోదు చేయడం ద్వారా ఎన్ని ఫిర్యాదులు వచ్చాయి? వాటిలో ఎన్ని పరిష్కరించారు? ఎన్ని పెండింగ్‌లో ఉన్నాయి వంటి వివరాలు సులభంగా తెలుస్తాయన్నారు. ప్రజావాణికి వచ్చేటప్పుడు రిజిస్టర్ తీసుకు రావాలని సూచించారు. ప్రతి సోమవారం కలెక్టర్ కార్యాలయంలో నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి ఉదయం 10.30 గంటలకు జిల్లా అధికారులు, మండల అధికారులు, మున్సిపల్ అధికారులంతా రావాలని ఆదేశించారు.

సంప్రదాయాలను కాపాడుకోవాలి



చిన్నారులకు సర్టిఫికెట్లను అందజేసిన నిర్వాహకులు

వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి బండారి రమేశ్

షాద్‌నగర్‌రూరల్: కళలకు ప్రాణం పోయడంతో పాటు సంస్కృతి, సాంప్రదాయాలను కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర కార్యదర్శి బండారిరమేశ్ పేర్కొన్నారు. పట్టణంలోని పతంజలి యోగా సమితి ఆధ్వర్యంలో స్వరరాగ సంగీత సుధ మ్యూజిక్ అకాడమీ గురువు ప్రేమ్‌కుమార్ సహకారంతో చిన్నారులకు వేసవి సంగీత శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు అన్నమాచార్య కీర్తనలు, కీ బోర్డు, గిటార్ వయోలిన్, డ్రమ్స్ వాయిద్యాలలో ప్రతిభను కనబరిచారు. పట్టణంలోని పతంజలి యోగా కేంద్రంలో ఆదివారం రాత్రి నిర్వహించిన శిక్షణ శిబిరం ముగింపు కార్యక్రమానికి ముఖ్యఅతిథులుగా వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి బండారిరమేశ్, పట్టణ ప్రముఖులు నాగిళ్లకుమార్ గుప్తా, టీవీ.రంగయ్య, హరీష్‌కుమార్‌శర్మ హాజరయ్యారు. అనంతరం వారు మాట్లాడుతూ.. కళలలో చిన్నారులు కనబరిచిన ప్రతిభ ఎంతో అద్భుతంగా ఉందని కొనియాడారు. చిన్నారులు విద్యతో పాటు అన్నిరంగాలలో రాణించినప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని అన్నారు. విద్యార్థులకు ఇలాంటి కళలను నేర్పించడంతో వారిలో సామాజిక స్పృహ పెరగడంతో పాటుగా కళలపై ఆసక్తి పెరుగుతుందని అన్నారు. చదువు ఒక్కటే ప్రధానం కాదని, కళలు, సాంస్కృతిక కార్యక్రమాలు ఎంతో అవసరమని అన్నారు. తెలుగుజాతి సంస్కృతిని పెంచే కళలకు మా వంతు సహకారాన్ని ఎల్లప్పుడూ అందిస్తామని అన్నారు. చిన్నారుల సంగీత ప్రదర్శనలు చూపరులను ఆకట్టుకుంది. అనంతరం శిక్షణ శిబిరంలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో సురేందర్, శివ, మల్లేశ్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి ఎన్‌ఆర్‌ఐల సహకారం



తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ప్రతినిధులతో లక్ష్మీనర్సింహారెడ్డి

నర్సంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి

కద్లాల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో రాష్ట్రానికి చెందిన ఎన్‌ఆర్‌ఐలు భాగస్వామ్యులు కావాలని సర్పంచ్‌ల సంఘం రాష్ట్ర మాజీ అధ్యక్షుడు గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి కోరారు. అమెరికాలో జరుగుతున్న ఆటా మహాసభలలో భాగంగా మూడో రోజు తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం ఏర్పాటు చేసిన సమావేశంలో లక్ష్మీనర్సింహారెడ్డి పాల్గొన్నారు. సమావేశంలో తెలంగాణలో విద్యా, వైద్యం, నీటి పారుదల తదితర అంశాలపై చర్చించినట్లు తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతున్న విద్యా పథకాలు సత్ఫలితాలు సాధించేందుకు ప్రవాస భారతీయుల భాగస్వామ్యంపై చర్చించినట్లు పేర్కొన్నారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులు సాధించిన ప్రగతిని, క్రీడల్లో సాధించిన విజయాలను ప్రజలందరికీ తెలిసే విధంగా ప్రతి గ్రామంలో కరపత్రాల ద్వారా అందుబాటులో ఉన్న వ్యవస్థలతో ప్రచారం నిర్వహించాలన్నారు. పెద్ద సంఖ్యలో విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విధంగా పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి ప్రణాళికలు రూపొందించాలని కోరారు. సొంత గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి ఎన్‌ఆర్‌ఐలు సహకరించాలని, పాఠశాలలను దత్తత తీసుకుని అభివృద్ధిలో భాగస్వామ్యులు కావాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ డెవలప్‌మెంట్ ఫోరం అధ్యక్షుడు భూపాల్‌రెడ్డి, టీడీఎఫ్ వ్యవస్థాపకుడు మధురెడ్డి, కిశోర్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే గొనే ప్రకాశ్‌రావు, భరత్‌రెడ్డి, ప్రీతి, నర్సింహారెడ్డి, సుభాష్ తదితరులు పాల్గొన్నట్లు ఆయన చెప్పారు.

మహిళ అదృశ్యం



సుగుణ (ఫైల్)

శంకర్‌పల్లి: ఓ మహిళ అదృశ్యమైన ఘటన సోమవారం శంకర్‌పల్లి మండలంలో చోటు చేసుకుంది. మోకిల పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కొండకల్ తండాకు చెందిన సుగుణ(45), కొన్నేళ్ల కిందట భర్త చందర్ మృతి చెందగా.. కొడుకుతో కలిసి ఉంటుంది. కొంతకాలంగా అనారోగ్య సమస్యలతో సుగుణ ఇబ్బంది పడుతుంది. కుటుంబ సభ్యులకు భారం కావొద్దనే ఉద్దేశంతో ఇప్పటికే ఇంట్లో నుంచి రెండుసార్లు వెళ్లి పోయింది. వెతికితే.. లింగంపల్లి రైల్వేస్టేషన్‌లో దొరికింది. అయితే, ఆదివారం సాయంత్రం బయటకి వెళ్లి వస్తానని చెప్పి ఇంట్లో నుంచి వెళ్లిన సుగుణ రాత్రి వరకు తిరిగి రాలేదు. అనుమానం వచ్చిన కుటుంబసభ్యులు చుట్టూ పక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో సోమవారం మోకిల ఠాణాలో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తునున్నట్లు ఎస్సై కోటేశ్వరరావు తెలిపారు.

నీట్ ఫలితాలపై సిట్టింగ్ జడ్జితో విచారణ చేయాలి

ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు పవన్‌చౌహాన్



షాద్‌నగర్‌రూరల్: దేశ వ్యాప్తంగా నిర్వహించిన నీట్ పరీక్ష ఫలితాలపై సుప్రీంకోర్టు సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని ఏఐఎస్‌ఎఫ్ రాష్ట్ర సమితి సభ్యుడు పవన్‌చౌహాన్ డిమాండ్ చేశారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఇటీవల వెలువడిన నీట్ పరీక్ష ఫలితాలపై విద్యార్థులు, తల్లిదండ్రులు అనేక అనుమానాలను వ్యక్తం చేస్తున్నారని అన్నారు. ఒకే కేంద్రంలో పరీక్షకు హాజరైన ఆరుగురు విద్యార్థులకు 100 శాతం మార్కులు రావడంతో అనుమానాలకు కారణం అవుతుందన్నారు. దక్షిణాది ముఖ్యమంత్రులు కేంద్ర ప్రభుత్వానికి చెప్పినప్పటికీ కేంద్రం వారి మాటలను పెడ చెవిన పెడుతుందన్నారు. ప్రస్తుత విద్యాసంవత్సరం నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ విడుదల చేసిన నీట్ ఫలితాలపై సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం వెంటనే స్పందించి విద్యార్థులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

ఆక్రమణలపై అధికారుల కొరడా

- ఈదులచెరువులో నిర్మించిన రోడ్డు కూల్చివేత
- పెద్దఅంబర్‌పేటవాసుల ఒత్తిడితో చర్యలు



ఈదులచెరువులో నిర్మించిన రోడ్డును జేసీబీలతో కూల్చివేయిస్తున్న అధికారులు

అబ్దుల్లాపూర్‌మెట్: నిబంధనలకు విరుద్ధంగా చెరువును ఆక్రమించుకొని యథేచ్ఛగా చేపట్టిన రోడ్డు నిర్మాణాన్ని రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు కూల్చివేశారు. గ్రామస్తులందరూ ఏకతాటిపైకి వచ్చి చెరువు ఆక్రమణను అడ్డుకోవాలంటూ అధికారులపై ఒత్తిడి తీసుకురావడంతో ఎట్టకేలకు రెండు జేసీబీల సహాయంతో రోడ్డును తొలగించారు. పెద్ద అంబర్‌పేటలోని ఈదుల చెరువును గత కొన్ని రోజులుగా కొంతమంది రియల్ వ్యాపారులు ఆక్రమించుకొని చెరువు మధ్యలోంచి రోడ్డు నిర్మాణం చేపడుతున్నారన్న విషయాన్ని స్థానిక కౌన్సిలర్లు, మాజీ కౌన్సిలర్లు, గ్రామస్తులు కొన్ని రోజులుగా ఇరిగేషన్ అధికారుల దృష్టికి తీసుకువెళ్తున్నా పట్టించుకోకపోవడంతో ధర్నా చేస్తామని హెచ్చరించగా సోమవారం రెవెన్యూ అధికారుల సహకారంతో కూల్చివేయించారు. ఈ క్రమంలో అధికారులకు గ్రామ ప్రజలకు మధ్య కొంత వాగ్వాదం సైతం చోటు చేసుకోగా, చెరువును కబ్జా కాకుండా స్పందించిన అధికారులకు ప్రజాప్రతినిధులు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఇరిగేషన్ డీఈ ఉషారాణి, తహసీల్దార్ రవీందర్‌దత్తు, మున్సిపల్ కమిషనర్ రవీందర్‌రెడ్డి, కౌన్సిలర్లు దండెం కృష్ణారెడ్డి పలుపార్టీల నేతలు ప్రభాకర్‌రెడ్డి, విజయేందర్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, రాజు, నాగేష్, బాలకృష్ణ, అరవింద్‌యాదవ్, యాదగిరిగౌడ్ గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

ఆక్రమణ వెనుక ఓ కౌన్సిలర్ హస్తం

చెరువు ఆక్రమణ వెనుక పెద్దఅంబర్‌పేటలోని అధికార పార్టీకి చెందిన ఓ కౌన్సిలర్ హస్తం ఉందని స్థానికులు ఆరోపించారు. భారీ స్థాయిలో ముడుపులు తీసుకుని చెరువులోంచి రోడ్డును వేసేందుకు ఆక్రమణదారులకు వెనుకనుంచి ఆయనే ప్రోత్సహిస్తున్నాడన్నారు. దీంతో పాటు ఆక్రమణదారుల ద్వారా ఓ ప్లాటును కూడా తన బినామీల పేరు మీద రాయించుకున్నట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయన్నారు. చెరువును ఆక్రమణదారుల నుంచి కాపాడాలని గ్రామానికి చెందిన కౌన్సిలర్లందరూ పోరాడి కూల్చివేయించేంత వరకూ అక్కడే ఉన్నారు. సదరు కౌన్సిలర్ అటువైపునకు రాకపోగా గ్రామంలో అందుబాటులో లేకపోవడంతో గ్రామస్తుల ఆరోపణలకు బలం చేకూరుతున్నదన్నారు. చెరువుపై ఆధారపడి ఉన్న మత్స్యశాఖ కార్మికులు హెచ్చరించినా పెడచెవిన పెట్టిన కౌన్సిలర్ ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ మండల స్థాయి అధికారులను సైతం బెదిరింపులకు పాల్పడుతున్నారని మత్స్యకారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

అడిషనల్ కలెక్టర్‌కు వినతి



అడిషనల్ కలెక్టర్‌కు వినతిపత్రం ఇస్తున్న మేయర్ పారిజాత

బడంగ్‌పేట్: అడిషనల్ కలెక్టర్ ప్రతిమసింగ్‌ను సోమవారం బడంగ్‌పేట కార్పొరేషన్ మేయర్ చిగురింత పారిజాతరెడ్డి కలిసి వినతిపత్రం అందచేశారు. కార్పొరేషన్ పరిధిలోని 10వ డివిజన్ కుర్మల్‌గూడలో ఉన్న జేఎన్‌ఎన్‌యూఆర్‌ఎం భవనాల సముదాయంలోనే ఖాళీగా ఉన్న భవనాలను గుర్తించి పేదలకు కావాల్సిన వసతులను కల్పించాలని కోరారు. ప్రాథమిక పాఠశాల, ప్రాథమిక వైద్యశాల, అంగన్‌వాడీ కేంద్రం ఇతర కౌంటర్లు కేటాయించేలా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. 2024–25 విద్యాసంవత్సం నుంచే తరగతులు ప్రారంభించేలా చూడాలన్నారు. వైద్యం సైతం అక్కడే నిర్వహించేలా చూడాలని వినతి పత్రంలో పేర్కొన్నారు.

సర్కారు బడుల్లో నాణ్యమైన విద్య



బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న స్రవంతి

ఇబ్రహీంపట్నం: సర్కార్ బడుల్లో పిల్లలను చేర్పించాలని మున్సిపల్ చైర్ పర్సన్ కప్పరి స్రవంతి అన్నారు. జయశంకర్ బడిబాటలో భాగంగా సోమవారం ఇబ్రహీంపట్నం బాలికల ప్రాథమిక పాఠశాలలో బడీడు పిల్లలు బడిలో అనే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. అర్హులైన ఉపాధ్యాయులతో నాణ్యమైన విద్యా బోధన సర్కార్ బడుల్లోనే జరుగుతుందని తెలిపారు. ఉచితంగా పాఠ్య, నోట్ పుస్తకాలను విద్యార్థులకు అందజేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయురాలు, సీహెచ్ కృష్ణకుమారితో పాటు సుమలత, తెలంగాణ ఉద్యమకారుడు అజయ్‌లు తదితరులు పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనాల దొంగల ముఠా అరెస్టు



వివరాలు వెల్లడిస్తున్న డీసీపీ రోహిణీ ప్రియదర్శిని

కంటోన్మెంట్: ద్విచక్ర వాహనాల చోరీకి పాల్పడుతున్న ముగ్గురు సభ్యుల ముఠాను బోయిన్‌పల్లి పోలీసులు అదుపులోకి తీసుకుని వారి నుంచి 14 బైక్‌లను స్వాధీనం చేసుకున్నారు. బోయిన్‌పల్లి పోలీస్ స్టేషన్ ఆవరణలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో నార్త్‌జోన్ డీసీపీ రోహిణీ ప్రియదర్శిని వివరాలు వెల్లడించారు. సూరారం ప్రాంతానికి చెందిన మెకానిక్, రజాక్ ఖాన్, మియాపూర్‌కు చెందిన డ్రైవర్ యమ్మల యోహాన్ స్నేహితులు. జల్సాలకు అలవాటు పడిన వీరు సులువుగా డబ్బు సంపాదించేందుకు బైక్‌ల చోరీకి పాల్పడుతున్నారు. గత అక్టోబర్ నుంచి 14 బోయిన్‌పల్లి, తిరుమలగిరి, నాంపల్లి, జీడిమెట్ల తదితర పోలీసు స్టేషన్ల పరిధిలో బైక్‌లు చోరీ చేశారు. మచిలీపట్నానికి చెందిన డీటీపీ సెంటర్ నిర్వాహకుడు గొరిపాటి వెంకటప్పయ్య ద్వారా డూప్లికేట్ ఆర్సీలను తయారు చేయించి ఓఎల్‌ఎక్స్‌లో వాహనాలను విక్రయించేవారు. ఇటీవల బోయిన్‌పల్లి పరిధిలో జరిగిన బైక్ చోరీ కేసులో నిందితులను గుర్తించిన పోలీసులు ఆదివారం బోయిన్‌పల్లి – సుచిత్ర మార్గంలో వెళ్తున్న వారిని గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. వారి నుంచి 14 బైక్‌లు, ల్యాప్‌టాప్, 4 వాహనాలకు సంబంధించిన నకిలీ రిజిస్ట్రేషన్ ధ్రువీకరణ పత్రాలను స్వాధీనం చేసుకున్నారు. ఒక ద్విచక్ర వాహనాన్ని పూర్తిగా స్క్రాప్ చేసి విక్రయించగా, మరో మూడు బైక్‌లు రికవరీ చేయాల్సి ఉందని డీసీపీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కీలకంగా వ్యవహరించిన కానిస్టేబుళ్లు రమేష్ మురళి, శివశంకర్ మహేష్, హోంగార్డు శ్రీనివాసులను డీసీపీ అభినందించారు. సమావేశంలో అదనపు డీసీపీ అశోక్ కుమార్, ఏసీపీ గోపాల కృష్ణమూర్తి, బోయిన్ పల్లి ఇన్‌స్పెక్టర్ లక్ష్మీనారాయణ, డీఐ సర్దార్ నాయక్ ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరి ఆత్మహత్యాయత్నం

భార్యతో గొడవపడి భర్త..

- మరో ఘటనలో భర్త వేధింపులు తాళలేక భార్య..
- చికిత్స పొందుతున్న బాధితులు

ఖైరతాబాద్: భార్యతో గొడవపడి భర్త ఒంటిపై డీజిల్ పోసుకొని నిప్పంటించుకోగా, మరో సంఘటనలో భర్త వేధిస్తున్నాడని భార్య ఒంటిపై స్పిరిట్ పోసుకుని నిప్పటించుకున్న సంఘటన ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకున్నాయి. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఖైరతాబాద్ బుడగజంగం బస్తీకి చెందిన పర్వతాలు(33) ఎర్రగడ్డ ప్రభుత్వ హాస్పిటల్‌లో కామాటిగా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసైన అతను మద్యం మత్తులో భార్యతో సుశీలతో గొడవపడ్డాడు. అనంతరం ఆమెను బయటకు పంపి తలుపులు వేసుకున్నాడు. సోమవారం తెల్లవారుజామున ఒంటిపై డీజిల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. అతడి అరుపులు విన్న భార్య, చుట్టుపక్కల వారి సాయంతో అతడిని ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించింది. 68 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతున్నాడు.

భర్త వేధిస్తున్నాడని..

భర్త తాగి వచ్చి వేధిస్తున్నాడని ఓ మహిళ ఒంటిపై స్పిరిట్ పోసుకుని నిప్పంటించుకున్న సంఘటన ఖైరతాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసుల కథనం మేరకు ఇందిరానగర్‌లో బిచ్చాల లక్ష్మీబాయి(32) భర్త రమేష్, ఇద్దరు పిల్లలతో కలిసి నివాసముంటోంది. భర్త తాగి వచ్చి వేధిస్తున్నాడని పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయతీ పెట్టగా సర్ది చెప్పారు. ఆదివారం రాత్రి మద్యం మత్తులో రమేష్ భార్యతో వాగ్వాదానికి దిగాడు. దీంతో మనస్తాపానికిలోనైన ఆమె స్పిరిట్ ఒంటిపై పోసుకుని నిప్పంటించుకుంది. దీనిని గుర్తించిన రమేష్ స్థానికుల సహాయంతో ఆమెను ఉస్మానియా హాస్పిటల్‌కు తరలించాడు. 40 శాతం కాలిన గాయాలతో చికిత్స పొందుతోంది. బాధితుల ఫిర్యాదు మేరకు ఖైరతాబాద్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

'ప్రైవేట్' దోపిడీకి అడ్డుకట్ట వేయండి

ఇంటర్మీడియట్ బోర్డు ఎదుట టీఎస్‌ఎస్‌ఎఫ్ నిరసన

నాంపల్లి: ఐఐటీ, నీట్, జేఈఈ కోచింగ్ పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న ప్రైవేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని కోరుతూ తెలుగునాడు విద్యార్థి సమాఖ్య (టీఎస్‌ఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో సోమవారం నాంపల్లిలోని ఇంటర్మీడియట్ బోర్డు కార్యాలయం ఎదుట నిరసన చేపట్టారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ నేతృత్వంలో జరిగిన కార్యక్రమానికి తెదేపా రాష్ట్ర ఉపాధ్యక్షురాలు కాట్రగడ్డ ప్రసూన హాజరై ప్రసంగించారు. విద్యను వ్యాపారం చేస్తూ రూ. లక్షల్లో ఫీజు దండుకుంటూ విద్యార్థులను, తల్లిదండ్రులను ఆర్థిక దోపిడీ చేస్తున్నారన్నారు. ఈ విషయంలో తెలంగాణ ఇంటర్మీడియట్ బోర్డు పట్టించుకోకపోవడం దారుణమని అన్నారు. ఇంటర్మీడియట్ విద్యను వ్యాపారంగా మార్చుకుని బుక్స్, స్టేషనరీ, దుస్తుల పేరుతో వేలాది రూపాయలు దోచుకుంటున్నారని ఆరోపించారు. సమాఖ్య రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్ మాట్లాడుతూ... జూనియర్ కళాశాలల్లో కోచింగ్ సెంటర్లను ఏర్పాటు చేసి అధిక ఫీజులు వసూలు చేస్తున్నారని, నిబంధనలకు విరుద్ధంగా కోచింగ్ సెంటర్లు నడుస్తున్నా ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని విమర్శించారు. ఇప్పటికైనా విద్యను వ్యాపారం చేస్తున్న ప్రైవేట్, కార్పొరేట్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లాభాల పేరుతో రూ. 41 లక్షల టోకరా

హిమాయత్‌నగర్: స్టాక్ మార్కెట్ ట్రేడింగ్‌లో అధిక లాభాలు వస్తాయని నమ్మించి ఓ వైద్యుడికి సైబర్ కేటుగాళ్లు భారీగా టోకరా వేశారు. నగర సైబర్ క్రైమ్ పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. నగరానికి చెందిన 47 ఏళ్ల బేరియాట్రిక్ సర్జన్‌ను ఫేస్ బుక్ ద్వారా సంప్రదించిన సైబర్ నేరగాళ్లు ట్రేడింగ్‌లో పెట్టుబడులు పెట్టాలని సూచించారు. భారీ లాభాలు వస్తాయని నమ్మించడంతో వారు చెప్పిన విధంగా పెట్టుబడులు పెట్టడం ప్రారంభించాడు. మొదట కొంత లాభాలు వచ్చాయని చూపించి నమ్మించారు. వాటిని విత్ డ్రా చేసుకునే వీలులేకుండా వాలెట్ పనిచేయడం లేదని వివిధ కారణాలు చెప్పారు. బాధితుడు మరోసారి మరో అకౌంట్ ద్వారా భారీ మొత్తంలో పెట్టుబడులు పెట్టాడు. ఈ విధంగా విడతల వారీగా రూ. 41,28,000 పెట్టుబడిగా పెట్టాడు. తాను మోసపోయినట్లు గుర్తించిన అతను న్యాయం చేయాలని కోరుతూ నగర సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సైబర్ క్రైమ్ ఏసీపీ శివ మారుతి తెలిపారు.

ఆర్‌ఎంపీ, పీఎంపీల సమస్యలు పరిష్కరించండి

హఫీజ్‌పేట్ : ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్యులపై దాడులకు అడ్డుకట్ట వేయాలని, సమస్యలు పరిష్కరించాలని కోరుతూ తెలంగాణ ఆర్‌ఎంపీ, పీఎంపీ వైద్య సంఘం ఆధ్వర్యంలో సోమవారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహను కలిసి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ రాష్ట్రంలో 45 వేల మంది ఆర్‌ఎంపీ, పీఎంపీలుగా పని చేస్తున్నామన్నారు. ఎంబీబీఎస్ వైద్యుల ప్రోద్బలంతో జిల్లా డీఎంహెచ్‌ఓ సహకారంతో తనిఖీలకు వస్తున్నామని తమను బెదిరించడమేగాక పోలీస్ స్టేషన్లలో కేసులు పెట్టిస్తున్నారని మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. వైఎస్సార్ హయాంలో తమకు శిక్షణతో పాటు సర్టిఫికెట్లు కూడా ఇవ్వాలని జీవో జారీ చేశారన్నారు. అనంతరం వచ్చిన బీఆర్‌ఎస్ ప్రభుత్వం తమను పట్టించుకోలేదన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్‌ఎంపీ, పీఎంపీ సమస్యలు పరిష్కరించాలని బెదిరింపులకు పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు.

రోడ్డు ప్రమాదంలో చిరువ్యాపారి మృతి



పాండు మృతదేహం

అత్తాపూర్: రోడ్డు ప్రమాదంలో ఓ చిరువ్యాపారి మృతి చెందిన ఘటన అత్తాపూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి. వెంకటరామిరెడ్డి రాజేంద్రనగర్ ఆర్టీసీ అధికారులు బస్ కండక్టర్ శివానంద్ వివరాల ప్రకారం.. రాజేంద్రనగర్ డిపోకు చెందిన (ఏపీ29 జెడ్232) వాహనం కోటీ నుంచి రాజేంద్రనగర్ వయా చింతల్‌మెట్ కిషన్ బాబుల మీదుగా ప్రయాణిస్తుంది. చింతల్‌మెట్ ప్రాంతానికి చెందిన పాండు(56) కూరగాయలు, పండ్లు విక్రయిస్తూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఎప్పటిలానే చింతల్ మెట్ వైపు ఆటోలో పాండు హనుమాన్ టెంపుల్ సమీపంలో ప్రమాదవశాత్తు బస్సుకింద పడిపోయాడు. డ్రైవర్ బ్రేక్ వేసినా లాభం లేకపోయింది. తలకు తీవ్ర గాయాలతో పాండు అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మినీ బస్సు ఢీకొని విద్యార్థిని మృతి

అత్తాపూర్: ద్విచక్రవాహనాన్ని మినీ బస్సు ఢీకొన్న ప్రమాదంలో ఓ విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందాడు. ఈ ఘటన అత్తాపూర్ పిఎస్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. ఇన్‌స్పెక్టర్ జి వెంకటరామిరెడ్డి వివరాల ప్రకారం.. చంద్రాయన్‌గుట్ట అసమాబాద్‌కు చెందిన ఓ విద్యార్థిని(18) పీవీ నరసింహారావు ఎక్స్‌ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 210 వద్ద జిమ్ చేసేందుకు ద్విచక్రవాహనంపై వస్తుంది. రోజు మాదిరిగానే జిమ్ చేసి ఇంటికి వెళ్లే క్రమంలో ఆరంగల్ చౌరస్తా సమీపంలో గుర్తుతెలియని మినీ బస్సు ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన విద్యార్థిని అక్కడికక్కడే మృతి చెందింది. విషయం తెలుసుకున్న అత్తాపూర్ పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అందజేశారు. సీసీ కెమెరాల పుటేజీల సాయంతో మినీ బస్సును గుర్తిస్తామన్నారు. ఈ మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఎఫ్‌టీఎల్‌లో ఆక్రమణలకు అడ్డుకట్ట వేయండి

మాతాజీనగర్ బస్తీవాసుల ఆందోళన



బేగంపేట పోలీస్‌స్టేషన్ వద్ద ఆందోళన చేస్తున్న మాతాజీనగర్ బస్తీవాసులు

సనత్‌నగర్: బేగంపేట డివిజన్ మాతాజీనగర్ సమీపంలోని హుస్సేన్‌సాగర్ ఎఫ్‌టీఎల్ స్థలంలో అక్రమ నిర్మాణాలపై స్థానిక బస్తీవాసులు, బీజేపీ నేతలు ఆగ్రహం వ్యక్తం చేశారు. దీనికి తోడు ప్రార్థనాలయాన్ని నిర్మించడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తూ సోమవారం ఆందోళన చేపట్టారు. మత విద్వేషాలను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపిస్తూ బస్తీవాసులతో కలిసి బీజేపీ నాయకులు జిల్లా కలెక్టర్, నార్త్ జోన్ అడిషనల్ డీసీపీ, జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్, బేగంపేట పోలీసులకు ఫిర్యాదు చేశారు. అక్రమ నిర్మాణాలు కూల్చకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. వివరాల్లోకి వెళితే..మాతాజీనగర్‌ను ఆనుకుని ఉన్న సర్వేనెంబర్ 194/1లో 10 ఎకరాల 20 గుంటల స్థలం ఉంది. ఇది ప్రభుత్వ స్థలంగా పేర్కొంటూ సదరు ఎలాంటి నిర్మాణాలు చేపట్టరాదంటూ గతంలో పలుమార్లు జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అధికారులు అక్రమ కట్టడాలను నేలమట్టం చేశారు. అయితే ఆక్రమణదారులు రూటు మార్చి ఇక్కడ ప్రార్థనాలయ నిర్మాణం చేపట్టారని, ఇది మత విద్వేషాలకు తావిస్తుందని, వెంటనే దానిని తొలగించాలని బస్తీ కమిటీ అధ్యక్షుడు నరేష్, బీజేపీ నేతలు నెమలి ఆనంద్ నేతృత్వంలో అధి కారులకు ఫిర్యాదు చేశారు. ఈ స్థలాన్ని ప్లాట్లుగా చేసి అమ్మకాలు సాగిస్తున్నా అధికారులు పట్టించుకోకపోవడంపై ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. కొందరు సిబ్బంది ప్రోత్సాహంతోనే నిర్మాణాలకు ఇంటి నెంబర్లు వస్తున్నాయని, మరో అడుగు ముందుకువేసి విద్యుత్ మీటర్లు సైతం ఇస్తున్నారని ఆరోపించారు. ముఖ్యమంత్రి క్యాంప్ కార్యాలయానికి కూతవేటు దూరంలో ఉన్న ఈ స్థలాన్ని రక్షించడంలో అధికారులు విఫలమ య్యారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను, ప్రార్థనాలయాన్ని తొలగించి బోర్డు ఏర్పాటు చేయాలని కోరారు.